క్రీడా విజేతలకు డిఇఒ అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్‌లో ఇటీవల జరిగి ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీలో విజయనగరం జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్ ఆదిలక్ష్మి పెద్ద తాడివాడ జిల్లా పరిషత్ హైస్కూలు ఉపాధ్యాయులు ఎస్ విజయలక్ష్మి, కోనూరు జెడ్‌పిహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర్ రెడ్డి , ఉప విద్యాశాఖ అధికారి వాసుదేవరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌పి రమణ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటనాయుడు, సన్యాసి నాయుడు అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న డిఇఒ

హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడి

- విలువలకు కట్టుబడి పనిచేసేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- రమాప్రభను గెలిపించాలని పిలుపు

ప్రజాశక్తి-బొబ్బిలి/ విజయనగరంటౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయని కృష్ణా, గుంటూరు పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆ దాడులను ఎదుర్కొని హక్కులు సాధించుకునేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని, అందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. 'కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రజాస్వామ్య హక్కులపై దాడి-మన కర్తవ్యం' అనే అంశంపై ఆదివారం బొబ్బిలి ఎన్‌జిఒ హోంలోనూ, 'ఉత్తరాంధ్ర అభివృద్ధి-శాసనమండలి ఎన్నికలు-పిడిఎఫ్ ప్రాధాన్యత' అనే అంశంపై విజయనగరంలోని ఎన్‌జిఒ హోంలోనూ సదస్సులు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలపై రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దాడి చేస్తున్నాయన్నారు. నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ఉద్యోగుల హక్కులపై దాడి జరుగుతున్నప్పటికీ ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల ఎమ్మెల్సీలు నోరు మెదపడం లేదన్నారు. రాజ్యాంగ సూత్రాలకు లోబడి నిజాయితీగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పని చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, ప్రజల హక్కుల సాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో గచ్చిబౌలి వద్ద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పటి ప్రభుత్వం 500 గజాల స్థలం ఇస్తే తీసుకోకుండా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తిరస్కరించినట్లు చెప్పారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి.. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను అమలు చేయడం లేదన్నారు. విద్యా రంగాన్ని నాశనం చేసేందుకు నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి ప్రాథమిక పాఠశాలలను మూసివేస్తున్నా రన్నారు. పెన్షన్ ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అని అన్నారు. ప్రతినెలా ఒకటో తేదీకి వేతనాలు ఇవ్వాలని, బకాయి డిఎలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు ద్వారానే పోరాడి సాధించుకొనేగలమని అన్నారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి పని చేసేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని అన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కెఎస్ లక్ష్మణరావు కోరారు. శాసనమండలిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, అన్ని రంగాల ఉద్యోగులు సమస్యలు పరిష్కారానికి పిడిఎఫ్ పని చేస్తుందన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపిస్తే శాసనమండలిలో పిడిఎఫ్ బలం పెరిగి హక్కులు సాధనకు పని చేస్తామన్నారు. మేథావులను ఎన్నుకోవాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం సరికాదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జోగారావు, రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు రెడ్డి కృష్ణమూర్తి, ఎల్‌ఐసి యూనియన్ నాయకులు జి.శ్రీనివాసరావు, జెవివి నాయకులు జి.శ్రీనివాస్, యుటిఎఫ్ నాయకులు కె.విజయగౌరి, ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ నాయకులు సురేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు వాసు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

అకడమిక్ పాఠ్యపుస్తకాలతోనే మంచి ఫలితాలు

అకడమిక్ పాఠ్యపుస్తకాలు చదవడం ద్వారా గ్రూప్ 2 పరీక్షల్లో మంచి మార్కులు ,ఫలితాలు వచ్చే అవకాశం ఉందని కృష్ణా, గుంటూరు జిల్లాలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఎస్ఎఫ్ఐ, డి వైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్లో ఆదివారం గ్రూప్ 2 అభ్యర్థులకు అవగాహన సదస్సు జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రూప్ 2 అభ్యర్థులు సంవత్సరాల తరబడి ప్రిపేర్ అవుతున్నా ప్రభుత్వం దానికి అనుగుణంగా పోస్టులు తీయడం లేదని అన్నారు. ప్రభుత్వం విడుదల చేస్తామంటున్న 185 పోస్టులు ఒక్క విజయనగరం జిల్లాకే సరిపోవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదల చేసి యువత భవిష్యత్తుతో ఆడుకుంటోందని అన్నారు. ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా గ్రూప్ 2 పోస్టులను పెంచాలని కోరారు. ఇదే సందర్భంలో విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం గ్రూప్ 2 పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. గ్రూప్ 2 పరీక్ష కు సిద్ధమయ్యే వారు ప్రధానంగా ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలు చదవాలని చెబుతూ పరీక్ష పేపర్ ఉండే విధానాన్ని వివరించారు.. ప్రిలిమనరీ పరీక్ష అయిన తర్వాత మెయిన్స్ 300 మార్కులకు రెండు పేపర్లు ఉంటాయన్నారు పేపర్ 2లో భారత రాజ్యాంగంపై 75 మార్కులు, మరో 75 మార్కులు ఆంధ్ర ప్రదేశ్ చరిత్రపై ఉంటాయని తెలిపారు. పేపర్ 3 లో పెద్ద మార్పు జరగబోతుందని, గతంలో ఎపి ఆర్థిక వ్యవస్థపై 75, ఇండియా ఆర్థిక వ్యవస్థపై 75మార్కులు ఉండేవని, కానీ ఇండియా,ఎపి ఆర్థిక వ్యవస్థ కలిపి 75 మార్కులకు ఇస్తారని తెలిపారు. మరో 75 మార్కులు సైన్స్ అండ్ టెక్నాలజీలో 5 విభాగాలు లో పెట్టారని వివరించారు. అనంతరం నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ అందచేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేష్, పి.రామ్మోహన్, డివైఎఫ్ఐ నాయకులు హరీష్, పావని ,యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్ కె ఈశ్వరరావు, నిరుద్యోగ అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రూప్2 అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రమాప్రభ, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నిరుద్యోగ యువతకు అండగా ఉంటా : రమాప్రభ

విజయనగరం టౌన్ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉండి, మీ సమస్యలపై చట్ట సభలలో గొంతు వినిపించి పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రూప్ 2 అభ్యర్థులకు అవగాహన సదస్సు జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కృష్ణా, గుంటూరు జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సదస్సులో పాల్గొన్న రమాప్రభ మాట్లాడుతూ ఇంత వరకు పరిపాలించిన పాలకులు, నేడు పరిపాలిస్తున్న వారు ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా యువతకు జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసి అన్యాయం చేసిందన్నారు. దానిపై పోరాటం చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులపై ఎన్నో కేసులు పెట్టి కక్ష సాధింపు చేస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో ఉన్న పరిశ్రమలను మూసివేయడం వల్ల ఉత్తరాంధ్ర నుంచి కూలీలతో పాటు, నిరుద్యోగ యువత కూడా వలసలు పోతున్నారన్నారు. లక్షా 50వేల మందికి ఉపాధి కల్పిస్తూ, 3లక్షల కోట్లు విలువైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రూ.30వేల కోట్లకు అదానికీ అమ్మేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే యువతంతా సంఘటితమై పోరాడాలన్నారు. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాను పిడిఎఫ్ ఎమ్మెల్సీల స్ఫూర్తితో నిరాడంబరంగా, నిస్వార్థంతో ఉత్తరాంధ్ర హక్కుల కోసం, అభివృద్ధి కోసం, నిరుద్యోగ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి నాయకులు కృష్ణమోహన్

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

- ఎపి జెఎసి రాష్ట్ర నాయకులు కృష్ణ మోహన్
- 9 నుంచి ఉద్యమ కార్యాచరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యమని మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఎపి జెఎసి అమరావతి ఉద్యోగులసంఘం ప్రతినిధి కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రెవెన్యూహోంలో జరిగిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగుల పరిస్థితి రాష్ట్రంలో అస్తవ్యస్తంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు వేతనాలు ఎప్పుడు అందుతాయో, అసలు అందుతాయో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఉద్యోగుల రాయితీలు, అలవెన్స్ బకాయిలన్నీ నిలిచిపోయాయని, చివరకు ఉద్యోగుల హెల్త్ కార్డులు కూడా పనిచేయడం లేదని వాపోయారు. కింది స్థాయి నుంచి అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వేతనాలు సమస్యను రాష్ట్ర నాయకులు పదేపదే ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోవడంతో తమ నాయకులు ఉద్యమాన్ని చివరి అస్త్రంగా ప్రకటించవలసి వచ్చిందన్నారు. ఈ ఉద్యమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల ఉద్యోగులు మద్దతు ప్రకటించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎపి ఐక్య కార్యాచరణ సమితి సలహాదారు డిజి ప్రసాద్, ట్రెజరీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధి పట్నాల పద్మనాభం, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్, రమణరాజు, జిల్లా డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎర్రంనాయుడు తదితరులు ప్రసంగించారు. అనంతరం పోరాట కార్యాచరణను ప్రకటించారు.ఈనెల 9,10తేదీల్లో ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన, 13, 14తేదీల్లో కలెక్టరేట్, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసనలు, 15,17, 20 తేదీల్లో కలెక్టరేట్‌వద్ద ధర్నాలు చేస్తామని ప్రకటించారు. 21 నుంచి ఉద్యోగులంతా వర్క్‌టు రూల్ పాటించాలని తెలిపారు. 24న రాష్ట్రస్థాయిలో కమిషనర్ కార్యాలయాల వద్ద ధర్నాలకు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 3న అన్ని కలెక్టరేట్లకు చలో స్పందన పేరిట వెళ్లి వినతులు అందజేయాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం

రింగ్‌రోడ్డులోని ఫైర్ చెస్ స్కూల్ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా స్థాయి అండర్ 7, 17 ఓపెన్ విభాగాల్లో ఆదివారం ఎంపికలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 50 మంది పోటీ పడగా అండర్ 7 విభాగంలో ప్రథమస్థానంలో పి. జయదీప్ నాయుడు, ద్వితీయ స్థానంలో డి.హంషిత్ నిలిచారు. . అండర్ 17 బాలికల విభాగంలో ఎ.శ్రీనిధి ప్రథమ స్థానం, జి.లక్ష్మి ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్ 17 ఓపెన్ క్యాటగిరి విభాగంలో ప్రథమం సి.వినీల్ రాధా కార్తీక్, ద్వితీయస్థానంలో కె.ప్రహ్లాద్ నిలిచారు. వీరు త్వరలో కృష్ణా జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. న్యాయ నిర్ణేతలుగా ధనలక్ష్మి, సైదా బేగం వ్యవహరించారు విజేతలకు ప్రధాన కార్యదర్శి కెవి జ్వాలాముఖి బహుమతులు అందజేశారు.

క్రీడాకారులను అభినందిస్తున్ననిర్వాహకులు

కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ సందీప్, మాజీ ఎంపి ఝాన్సీలక్ష్మి

'ధీర 'ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సీతం కాలేజీలో ఆదివారం ధీర ఫౌండేషన్ ఆధ్వర్యాన కుట్టులో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య ఆతిథులుగా మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి, ధీర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బొత్సా సందీప్ పాల్గొన్నారు. శిక్షణా కార్యక్రమంలో 120 మంది పేద మహిళలను గుర్తించి వారికి ఉచితంగా 60 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ ఈ విధమైన స్వయంఉపాధి కార్యక్రమాలు ముఖ్యంగా మహిళలకు ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. భవిషత్తులో మరెన్నో కార్యక్రమములు ధీర ఫౌండేషన్ ద్వారా అందిస్తామని చెప్పారు. డాక్టర్ సందీప్ మాట్లాడుతూ మహిళలకు వారి జీవనోపాధి నిమిత్తం స్వయం ఉపాధి కార్యక్రమాలు ఎల్లప్పుడూ నిర్వహిస్తామన్నారు. బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ మహిళలు వారి పిల్లల పట్ల ఎంతో జాగ్రత్తగ ఉండాలని అన్నారు. పిల్లలకు మొబైల్ ఫోన్ వాడకం వలన జరిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో ధీర ఫౌండేషన్ డైరెక్టర్ పూజిత , సత్య ఎడ్యుకేషనల్ సంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణ్ రావు, ప్రోగ్రాం మేనేజర్ చక్రధర్, ఎం. రవి కుమార్ పాల్గొన్నారు.

సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి మొక్కజొన్న, అరటి పంటల రైతులను ఆదుకోవాలని రైతు సంఘం, సిఐటియు నాయకులు మాదిరెడ్డి తిరుపతినాయుడు, కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి పంటలను ఆదుకోవాలని కోరుతూ మండలంలోని కొత్తవలసలో రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 40 రోజులుగా వేళాపాలాలేకుండా విద్యుత్ కోతలు విధించడం వల్ల వ్యవసాయానికి సక్రమంగా నీరందక మొక్కజొన్న, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులను అడిగితే ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం చాలకపోవడంతో ఈ ఇబ్బంది జరుగుతుందని చెబుతున్నారని అన్నారు. కావున జిల్లా అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచి వ్యవసాయానికి సాగునీరందించాలని కోరారు. లేకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. బాధిత రైతులు మతల రమేష్, బొంగు అప్పలనాయుడు, లంకెన త్రినాధ, కిర్ల శంకర్రావు మాట్లాడుతూ సక్రమంగా విద్యుత్ అందించి తమను ఆదుకోవాలని కోరారు.

మండుటెండలో తలలపై తువ్వాళ్లు వేసుకున్న కూలీలు

మండుటెండలో ఉపాధి పనులు

- టెంట్లు లేక ఇబ్బందులు
- పనులు వద్ద కానరాని సౌకర్యాలు

ఉపాధి పనులు చేసే చోట నిలువ నీడ లేక కూలీలు అవస్థలు పడుతున్నారు. చాలా చోట్ల కనీసం తాగునీటి సౌకర్యాలను కూడా అధికారులు కల్పించడం లేదు. ప్రథమ చికిత్స కిట్ల పరిస్థితి మరి చెప్పనక్కర్లేదు. గత 5 ఏళ్లుగా ఉపాధి హామీ కూలీల కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లును మంజూరు చేయలేదు. ఎండ తీవ్రతను తట్టుకోలేక చాలా మంది కూలీలు తమ వెంట తెచ్చుకుంటున్న తువ్వాళ్లు , గమేళ్లను తలపై పెట్టుకొని సేద తీరుతున్నారు. రానున్న కాలంలో ఎండలు పెరిగే అవకాశం ఉండడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 39 గ్రామపంచాయతీలలో 51 రెవెన్యూ గ్రామాలతో పాటు మరో 16 హేబిటేషన్ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పనులలో భాగంగా కూలీలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి 5 గంటల వరకు మండుటెండల్లోనే పనులు చేయవలసిన పరిస్థితి నెలకొంది. ఏ గ్రామంలో చూసినా ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు ఉండటం లేదు. దీంతో మండుటెండల్లోనే పనులు చేయటంతో వేతనదారులు అస్వస్థతకు గురవుతున్నారు. పనుల వద్ద టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు వంటివి ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ ఆ క్షేత్ర స్థాయిలో ఆపరిస్థితి కనిపించడం లేదు. 2017లో అప్పటి ప్రభుత్వాలు ఉపాధి హామీ పనుల వద్ద టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స బాక్సులు పంపిణీ చేశాయి. ప్రస్తుతం ఆ టెంట్లు పూర్తిగా చిరిగిపోవటంతో ఎక్కడా కాన రావడం లేదు. తాగునీటి విషయానికొస్తే గతంలో వేతనదారులు వాటర్ బాటిల్స్‌తో నీరు తెచ్చుకుంటే వేసవికి అదనంగా కూలితో పాటుగా తాగునీటి కోసం డబ్బులు పడేవి. కానీ ప్రస్తుత పరిస్థితి లేదు. తాగునీరు తెచ్చేందుకు ప్రత్యేకంగా కూలీని కేటాయించడం లేదు.

గమెన్లు, తువ్వాల్ల నీడలోనే..

పనిచేసే చోట టెంట్లు ఏర్పాటు చేయకపోడంతో చాలా మంది కూలీలు వారి వెంట తీసుకెళ్లిన గమేన్లు, తువ్వాళ్లను తలపై పెట్టుకొని ఎండ తీవ్రత నుంచి సేద తీరుతున్నారు. పనులు వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడం అన్యాయమని కూలీలు అంటున్నారు. ఇటీవల క్షేత్ర స్థాయిలో ఎంపిడిఒ కాశీ విశ్వనాధరావు, ఎపిఒ హరినాథ్ పల గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించడానికి వెళ్లినపుడు అక్కడ సౌకర్యాలు లేకపోవడాన్ని గమనినంచి ఆసహనానికి గురయ్యారు. కనీసం సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడైనా పనులు వద్ద సౌకర్యాలు కల్పించాలని, టెంట్లు వేయించి నీడ ఏర్పాటు చేయాలని సూచించారు.

మండుతున్న ఎండలు

మండలంలో ప్రతి రోజు 37 డిగ్రీలకు పైబడి ఎండలు మండుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ ఎండలు 40 నుంచి 45 డిగ్రీల వరకు వెళ్లే పరిస్థితి ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అటువంటి సమయంలో సౌకర్యాలు లేకుండా ఉపాధి పనులు చేయడం చాలా కష్టమని కూలీలు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఎ పనిచేసే చోట సౌకర్యాలు కల్పించాలని వేతన దారులు కోరుతున్నారు.

టెంట్లు లేకపోవడం వాస్తవమే

ఉపాధి పనుల వద్ద నీడ కోసం టెంట్లు లేకపోవడం వాస్తవమే. 2017లో టెంట్లు పంపిణీ చేశారు. నేటి వరకు టెంట్లు రాలేదు. దీనికి తోడు తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు వంటివి నేటి వరకు పంపిణీ కాలేదు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఇండెంట్ పెట్టాం. వాటి కోసం ఎదురు చూస్తున్నాం. టెంట్లు వచ్చిన వెంటనే ఆ గ్రామాలకు పంపిణీ చేస్తాం.

లక్ష్మీపతి రాజు,
ఇంఛార్జి ఎపిడి, రాజాం క్లస్టర్.

తాగునీరూ లేదు..

చెరువు పనుల వద్ద టెంట్లు లేక ఎండలకు అస్వస్థతకు గురవుతున్నాం. ఇప్పటివరకు టెంట్లు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉంది. పనులు చేసేటప్పుడు అస్వస్థతకు గురైతే టెంట్లు లేక ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. టెంట్లతోపాటు తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు కూడా లేవు. ఎండల తీవ్రత వల్ల జరగరాని ప్రమాదం జరిగితే అధికారులు బాధ్యత వహించాలి.

గుండ కృష్ణ, ఉపాధి కూలి, రేగిడి

కనీసం నీడ లేదు..

ఉపాధి పనుల వద్ద టెంట్లు కనీసం నీడ ఉండటం లేదు. ప్రతి రోజూ ఎండలు మండిపోతున్నాయి. పనులు చేశాక సేద తీరేందుకు నీడ లేక మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గత నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఏ అధికారి పట్టించుకోవడం లేదు.

శ్రీదేవి, ఉపాధి కూలీ, సంకిలి

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు సమక్షంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ పెదపెంకి-2 పాఠశాలలో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. విజయనగరం వెంకట పుష్పగిరి కంటి హాస్పిటల్ ఆప్తామిస్ట్ వి.కిరణ్ 31 మందికి కళ్లు తనిఖీలు చేయగా 18మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారని, వీరికి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. పెదపెంకితో పాటు బైరిపురం, తుమరాడ గ్రామాలకు నేత్ర రోగులు తనిఖీలు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో కాగాన సుధీర్, కర్రి సతీష్, పి.భాస్కర్, ఎం.శ్రీను, జి.శ్రావణ్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉన్నట్టా? లేనట్టా?

వీరఘట్టం : ఈనెల 13న జరగనున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలను అధికారులు యథేచ్ఛగానే ఉల్లంఘిస్తున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో, బహిరంగస్థలాల్లో ఏ పార్టీలకు చెందిన బొమ్మలు, బ్యానర్లు ఉండకూడదన్న స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ అధికారులు నిబంధనలకు నీళ్లొదుతున్నారు. రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వ వాహనాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బొమ్మలను తొలగించకపోవడంతో ఎన్నికల నియమాలు ఉన్నదా ?లేదా? ప్రజల నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఎన్నికల నిబంధనలను తూచా తప్పక పాటించాలని కోరుతున్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

సాలూరు : మాహాత్మా జ్యోతిరావు పూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ మూకల పెంటయ్య తెలిపారు. జిల్లాలోని మూడు పాఠశాలల్లో ప్రవేశానికి ఈనెల 5నుంచి ఏప్రిల్ 4వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సాలూరు బాలికల పాఠశాలలో 80సీట్లు, పార్వతీపురం పాఠశాలలో 40సీట్లు, కురుపాం బాలురు పాఠశాలలో 40సీట్లు ఉన్నాయని చెప్పారు. నాలుగో తరగతి స్థాయిలో ప్రతిభా పరీక్ష ఉంటుందన్నారు. తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు, పరిసరాల విజ్ఞానం అంశాలపై 50 ప్రశ్నలుంటాయని తెలిపారు. రెండు గంటల సమయంలో పరీక్ష ఒఎంఆర్ సీట్లలో రాయాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నిరంతరాయంగా చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 9నుంచి 13ఏళ్ల వయస్సు, తల్లిదండ్రుల ఆదాయం లక్షరూపాయలు దాటని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొత్తం సీట్లలో 74శాతం సీట్లు బిసిలకు కేటాయించగా, మిగిలిన సీట్లు ఎస్సీ, ఎస్టీ, ఇబిసిలకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. https://mjpapbcwreis.apsfss.in సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ మూకల పెంటయ్య విలేకరుల కు చెప్పారు.

పోటీ పరీక్షల పుస్తకాలు అందజేత

గుమ్మలక్ష్మీపురం: నిరుద్యోగ యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పోటీ పరీక్షలకు సంబంధించి మెటీరియల్ అందజేసినట్లు ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ అన్నారు. త్వరలో జరగబోయే ఎస్ఐ ఉద్యోగ శిక్షణకు సంబంధించి స్థానికంగా శిక్షణ పొందుతున్న 30 మంది యువతకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఆయన అందజేశారు. గిరిజన ప్రాంతంలో ప్రతిభ కలిగిన యువతీ యువకులున్నా సరైన ప్రోత్సాహం లేకపోవడంతో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని అన్నారు. వీరి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆసక్తి కలిగి గల యువతీ యువకులకు పోటీ పరీక్షలు సమాచారం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు, ఎఎస్ఐ తిరుపతిరావు, పిడి ఉపాధ్యాయులు వైకుంఠరావు చంద్రమోహన్ ఉన్నారు.

రేషన్ బియ్యం అందక అవస్థలు

సీతంపేట : మండలంలోని ఈతమానుగూడ పంచాయతీల్లో గిరిజనులకు రెండునెలలుగా రేషన్ బియ్యం అందక గిరిజనులు ఆకలితో అలమటిస్తున్నారని ఎపి గిరిజన సంఘం నాయకులు బిడ్డిక అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మండ కెపి, యాతమానుగూడ తదితర గిరిజన గ్రామాలకు గత రెండునెలలుగా రేషన్ బియ్యం అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతేడాది కూడా ఇలాగే నాలుగు నెలలుగా రేషన్ బియ్యం అందక ఇబ్బందులు పడ్డామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే నెట్‌వర్క్ సమస్య అని చెబుతున్నారు తప్ప సమస్యను పరిష్కరించడంలేదన్నారు. దీంతో గిరిజనులకు పస్తులు తప్పడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రేషన్ బియ్యం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరా చేయాలని ఆందోళన

పాచిపెంట : వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి మొక్కజొన్న, అరటి పంటల రైతులను ఆదుకోవాలని రైతు సంఘం, సిఐటియు నాయకులు మాదిరెడ్డి తిరుపతినాయుడు, కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి పంటలను ఆదుకోవాలని కోరుతూ మండలంలోని కొత్తవలసలో రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 40 రోజులుగా వేళాపాలాలేకుండా విద్యుత్ కోతలు విధించడం వల్ల వ్యవసాయానికి సక్రమంగా నీరందక మొక్కజొన్న, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులను అడిగితే ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం చాలకపోవడంతో ఈ ఇబ్బంది జరుగుతుందని చెబుతున్నారని అన్నారు. కావున జిల్లా అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచి వ్యవసాయానికి సాగునీరందించాలని కోరారు. లేకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. బాధిత రైతులు మతల రమేష్, బొంగు అప్పలనాయుడు, లంకెన త్రినాధ, కిర్ల శంకర్రావు మాట్లాడుతూ సక్రమంగా విద్యుత్ అందించి తమను ఆదుకోవాలని కోరారు.

ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం తప్పనిసరి

వీరఘట్టం : ఆరోగ్యాన్ని పరిక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యం ఆవరణలో సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యాయామంతో పాటు అప్పుడప్పుడు సైకిల్ కూడా తొక్కితే కొన్ని వ్యాధులు దూరంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకొకసారి వ్యాయాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి, స్టాఫ్‌నర్స్ చిన్నమ్మడు, ఎంఎల్‌హెచ్‌పిలు భాగ్యరాధ, కావ్య, ఎఎన్ఎం ఉష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

కురుపాం : మండలంలోని నీలకంఠపురం పంచాయతీ పొక్కిరికి చెందిన బిడ్డిక గణపతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన తెలుసుకున్న వెంటనే ఆమె కుమారునికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10వేలును సర్పంచ్ ఎ.మన్మధరావు, ఎఎంసి మాజీ చైర్మన్ ఎన్.వెంకటరావు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ.10వేలు వెంటనే అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు , యువత పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో న్యాయ సేవలు

పాలకొండ : పేదలకు న్యాయసేవలను అందుబాటులో ఉంచడమే లక్ష్యమనిన్యాయసేవాధికార సంస్థ మండల అధ్యక్షులు, జడ్జి అగ్గాల విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అంపిలిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రౌతు సత్యనారాయణ, సరళా కుమారి, విజయలక్ష్మి, ఎస్ఐ బి.శివప్రసాద్, వైస్ ఎంపిపి వి.అనీల్‌కుమార్, సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో తెల్లవారుజామున అనుకోకుండా జింక పాఠశాల లోపలకు ప్రవేశించడంతో అప్పటికే అక్కడే ఉన్న కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. అది గమనించిన విద్యార్థులు కుక్కలను తరిమి విషయం సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది గాయపడ్డ జింకను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకు రాగా, పోలీసులు అటవీశాఖ అధికారులకు సమాచారం తెలిపారు. దీంతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.మనోజ్ సిబ్బందితో పోలీస్ స్టేషన్ చేరుకున్న సమయానికి జింక్ మృతి చెందింది. సెక్యూరిటీ గార్డ్ నుంచి జింక మృతిదేహాన్ని స్వాధీనం చేసుకొని జోగింపేట సమీపంలో ఆయన పర్యవేక్షణలో వెటర్నరీ డాక్టర్ రామారావు పోస్టుమార్టం నిర్వహించి అనంతరం ఖననం చేశారు.

కష్టమంతా మట్టి పాలు

- ఇంకా కళ్లాల్లోనే ధాన్యం
- కొనుగోలు లేక రైతులు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ధాన్యం కొనుగోలు లేక సక్రమంగా జరగకపోవడంతో ఎక్కడికక్కడే ధాన్యం కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని నడుకూరు, తూడి, చిదిమి, చలివేంద్రి, దశమంతపురం, నర్సిపురం, యు. వెంకంపేట గ్రామాల్లో అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేయవలసి ఉన్నప్పటికీ కొనకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ధాన్యం బస్తాల్లో వేసి సుమారు మూడు నెలలు కావస్తున్నప్పటికీ కొనుగోలు లేకపోవడంతో ఎండకి ఎండి మంచుకు తడిసి గోనెసంచులు పగలిపోవడంతో రైతు కష్టమంతా నేలపాలవుతుంది. ఇందులో భాగంగానే కొట్టు గుమ్మడ గ్రామంలో నేటికీ ధాన్యం కొనుగోలు లేక రైతు ఆరుగాలం కష్టించి పండించిన పంట కళ్ళ ముందు నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయలేదని, గత నెల 16వ తేదీన నర్సిపురం, చలివేంద్రి గ్రామ రైతులు ప్రధాన రహదారికి అడ్డంగా ధాన్యం బస్తాలు వేసి రాస్తారోకు కార్యక్రమం చేపట్టడం పాఠకులకు తెలిసిందే. ఈ రాస్తారోకో కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పర్యటనకు కూడా చుక్కెదురైంది. అప్పట్లో కలెక్టర్ స్పందించి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ ఇంకా చాలా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు లేక రైతులు కళ్లాల్లో కాపలకాయ వలసిన పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు మండలంలో ఏనుగులు గుంపు సంచారం కారణంగా తమ పంటలను నాశనం చేస్తాయేమోనని భయంతో అనుక్షణం భయంతో కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

కొట్టుగుమ్మడ గ్రామంలో ధాన్యం బస్తాలు చినిగిపోవడంతో నేల పాలైన పంట

వృద్ధులకు నిత్యవసరాలను పంపిణీ చేస్తున్న దాతలు, ట్రస్టు సభ్యులు

ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 35 మంది ఒంటరి వృద్ధులకు ఆదివార ం12 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు చెరుకూరి నాగరాజు, రైల్వే రిటైర్డ్ ఉద్యోగి రమణ ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సేవలు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. రానున్న రోజుల్లో ఆర్యవైశ్య సంఘం సభ్యులు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఈ ట్రస్ట్‌కు ఉంటాయని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ్ హరికుమార్ మాట్లాడుతూ పదిమంది వృద్ధులతో మొదలై 35 మందికి చేరుకున్న ట్రస్ట్ ఇంత దిగ్విజయంగా కార్యక్రమాలు చేస్తుందంటే కేవలం ట్రస్ట్ సభ్యుల సహాయ సహకారాలని గుర్తు చేశారు. ఒక సభ్యుడు చేరితే ఒక వృద్ధురాలు బతుకుతుందని ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి ట్రస్ట్‌లో సభ్యులు కావలసిందిగా కోరారు. అనంతరం వృద్ధులకు నిత్యవసర సరుకులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విన్నకోట సతీష్, పూసర్ల సాయి, మామిడి రమేష్, పూసర్ల రామన్, తీగల గుప్తా, కోనగళ్ల సర్వేశ్వరరావు, విన్నకోట వరహాలు, ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు గోవిందరావు, ప్రసాద్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - వేపాడ

ప్రిన్సిపల్ ఉషారాణి

మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ ఉషారాణి తెలిపారు. తమ పాఠశాల, కళాశాలలో, ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరిస్తున్నామన్నారు. ఎస్‌సి 75, బిసిసి 6, ఎస్‌టి 6, బిసి 5, ఒసి 2 శాతం సీట్లు కేటాయించామన్నారు. ఈ నెల 23లోగా విద్యార్థుల ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. అంబేద్కర్ గురుకులంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తుల స్వీకరిస్తామన్నారు. దరఖాస్తుకు ఎటువంటి రుసుమూ చెల్లించాల్సిన పనిలేదన్నారు. ఒకసారి ఆన్‌లైన్‌లో దరఖాస్తు అప్‌లోడ్ చేసినన తరువాత ఎటువంటి మార్పులూ ఉండవని దరఖాస్తు పెట్టినపుడే జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి 4వ తరగతి సిలబస్ మీద 50 మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు.

ఆకట్టుకున్న గుర్రపు పరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరులో శ్రీరామ ఆలయ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి గుర్రపు పరుగు ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ పోటీలలో విజయ నగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల నుండి 15 గుర్రాలు పాల్గొని తలబడ్డాయి. విజేతలకు డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకటచిన రామనాయుడు చేతుల మీదుగా నగద బహుమతలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి టివి రమణ, సర్పంచ్ బుద్ధ చిన్నమ్ములు, నాయ కులు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ వారాధి అప్పలనాయుడు, పి. కృష్ణ, రామాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు పందేలను తిలకిస్తున్న ప్రజలు

విజయాలకు అద్దం పట్టేలా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

ముఖ్యంగా మహిళలు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విజయాలను గౌరవించడం కోసం ఇది విస్తృతంగా మహిళా దినోత్సవం నిర్వహించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈనెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా నియోజకవర్గం కేంద్రంలో పట్టణంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవీ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. మహిళా సంఘం సభ్యులు, వారి గొప్పతనం, ప్రాముఖ్యతను తెలుపుతూ పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలగా నిలిచిన బృందాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి ఏటా మార్చి 8 న జరుపుకొంటున్న విషయం అందరికీ తెలిసిందేనని, ఆరోజు ముఖ్యంగా మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విజయాలను గౌరవించడం కోసం ఇది విస్తృతంగా నిర్వహిస్తారని తెలిపారు. లింగ సమానత్వం, పునరుత్పత్తి హక్కులు, మహిళలపై హింస, సమాన హక్కులు మొదలైన సమస్యలపై ఎక్కువగా చర్చిస్తూ మహిళలను పురుషులతో సమానంగా భావించినప్పుడే మనం సామాజికంగా అభివృద్ధి చెందుతామని అన్నారు. పురుషులంతా తమ భాగస్వామిని గౌరవించాలని ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు. మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విజయాలకి అద్దం పట్టే దినోత్సవమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని, తమ హక్కుల కోసం పోరాడిన ముఖ్యమైన మహిళలందర్నీ ఆ రోజు స్మరించుకోనే గొప్ప దినం అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పాత పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జరజాపుపేట సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో బాడంగి శాఖా గ్రంథాలయానికి పాత పుస్తకాలను ఆదివారం అందించారు. సాధన యువజన సంఘం యువకుల గత కొంత కాలంగా పాత పుస్తకాలన సేకరించారు. వీటిని ఆ గ్రంథాలయాధికారి రొంగలి దుర్గాప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా లైబ్రరీ కోసం పాత పుస్తకాలను డొనేషన్ చేయాలనుకుంటే సాధన యువజన సంఘం ప్రతినిధులను సంప్రదిస్తే మీ ఇంటి వద్దకే వచ్చి పుస్తకాలను కలెక్ట్ చేసుకుని స్థానిక లైబ్రరీస్‌లో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాధన యువజన సంఘం ఉపాధ్యక్షుడు బెల్లాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు శీల చిరంజీవి, నల్లి ఉమా శంకర్, పల్ల శ్రీహరి, హరి సాయి, మద్దిల ఉమా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలను అందిస్తున్న యువత

వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- విజయనగరం కోట

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అయ్యన్నపేట, శ్రీ నల్లమారమ్మ ఆలయం దగ్గరలో వున్న ఓ ప్రైవేట్ లే అవుట్‌లో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డిస్ట్రిక్ట్ -102 గవర్నర్ కర్రోతు సత్యం మాట్లాడుతూ వాకర్స్ క్లబ్బులు సమాజానికి ఆదర్శంగా ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. డిస్ట్రిక్ట్ -102 పరిధిలో ఉన్న క్లబ్బులు సేవల్లో ముందున్నాయన్నారు. ఈ సమావేశంలో విజయన గరంలో ఉన్న బాలాజీ వాకర్స్ క్లబ్, తోషిని వాలా వాకర్స్ క్లబ్, ప్రగతి వాకర్స్ క్లబ్, ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్, శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొని వాకర్స్ క్లబ్బుల విశిష్ఠతను, విధి విధానాల ప్రణాళికను తెలుపుతూ క్లబ్బుల పురోగతి కోసం ప్రసంగించారు. క్లబ్ కార్యదర్శి కోట్ల సత్యనారాయణ, కోశాధికారి జి. గోవిందరావు, ఉపాధ్యక్షుడు వై.నలమారాజు, క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు, గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు, క్లబ్ పెద్దలు ఎడ్ల గణేష్, ఆర్.సి.హెచ్.అప్పలనాయుడు, నాలుగెస్సుల రాజు, కృష్ణం రాజు, టి.చిరంజీవి రావు, ఐ.రామరాజు, ఈపు విజయ్ కుమార్, పప్పు విశ్వనాథం, శ్రీనివాస రెడ్డి, డి.సన్యాసిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కర్రోతు సత్యం

చెట్ల నీడలోనే చదువులు

వీరఘట్టం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవన సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయట చదువులు కొనసాగించాల్సి వస్తుంది. ఇక్కడ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు సంబంధించి సుమారు 167 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. డిగ్రీ కళాశాలలో బైపిసి, ఎంపిసి, సిబిజెడ్ వంటి కోర్సుల్లో విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారు. కళాశాలకు సరైన భవన సదుపాయం లేకపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహణ కొనసాగిస్తున్నారు. అన్ని రకాల సబ్జెక్టులకు సంబంధించి పూర్తిస్థాయిలో అధ్యాపకులు ఉన్నప్పటికీ భవన సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు చెట్ల నీడలో చదువాల్సిన పరిస్థితి దాపురించింది. ఒకవైపు ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదని ఈ కళాశాలను చూస్తే అర్థమవుతుంది. భవన సదుపాయం ఏర్పాటు చేయాలని స్థానిక పాలకులకు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులకు అవస్థలు తప్పటం లేదు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి భవన సదుపాయం ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.

చెట్ల నీడలో కూర్చున్న విద్యార్థినులు

ఘనంగా ఫేర్‌వెల్

విజయనగరం : రింగ్‌రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. లేడీస్ రిక్రియేషన్‌క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వి.శ్రీనివాసరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో విద్యార్థుల నూరు శాతం ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు బంగారు బాట వేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా టెన్త్ ఫలితాల్లో పాఠశాలను ఉన్నత స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్ ప్రిన్సిపాల్ జగదీష్, డీన్లు సాయి కిశోర్, సత్యనారాయణ, అప్పలనాయుడు విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్నొన్నారు.

నృత్యం చేస్తున్న చైతన్య పాఠశాల విద్యార్థినులు

గ్యాస్ ధర పెంపుతో ఆర్థిక భారం

- గ్యాస్ ఏజెన్సీ డోర్ డెలివరీ పేరుతో మరో రూ.45 అదనపు వసూలు
- సామాన్యులకు గుదిబండగా మారిన గ్యాస్ ధర పెంపు

ప్రజాశక్తి- రేగిడి

గృహ అవసరాలకు వినియోగించే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరను చమురు సంస్థలు ఒకేసారి రూ. 50 పెంచాయి. 2014లో రూ.410 ఉన్న గ్యాస్ బండ ధరను బిజెపి అధికారంలోకి వచ్చిన ఈ 9 ఏళ్ల కాలంలో ఏకంగా రూ.745 పెంచి ఇప్పుడు రూ.1155కు చేరింది. దీంతో కూలీలు, సామాన్యులపై ఆర్థిక భారం పడుతుంది. దీనికి తోడుగా పాలకొండ శ్రీ వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ, రాజాం శ్రీలక్ష్మి గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం కిలోమీటర్ నుంచి 20 కిలోమీటర్ మేర డోర్ డెలివరీ పేరుతో అదనంగా రూ. 45 వసూలు చేస్తూ ఎల్‌పిజి గ్యాస్ ధర రూ.1200 వినియోగదారులకు భారంగా మారింది. కరోనా నుంచి ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు ఉచిత బియ్యం ప్రకటించినప్పటికీ గ్యాస్ ధర మాత్రం అమాంతంగా ప్రతి నెల 2 నుంచి 3 సార్లు పెంచడంతో సామాన్యులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

రాయితీలూ ఇవ్వడం లేదు

గతంలో గ్యాస్ కొనుగోలు చేసిన తరువాత వినియోగదారుని ఖాతాలో ప్రభుత్వం రాయితీ డబ్బును వేసేది. గత మూడేళ్లగా ఆ పరిస్థితి కూడా లేదు. కనీసం రాయితీలు కూడా వేయకపోవడంతో ఇప్పుడు పెరిగిన ధరలు గుదిబండగా మారాయి. గ్యాస్ ధరలు తగ్గించాలని వినియోగదారులు ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోపోవడంతో సామాన్యులు సైతం మండిపడుతున్నారు. గ్యాస్ ధరలు తగ్గించే వరకు పోరాటాలు ఆగవని హెచ్చరిస్తున్నారు.

గ్యాస్ సరఫరా చేస్తున్న బోయ్

గ్యాస్ ధరలు పెరగడంతో ఇబ్బందులు

నెల నెలా గ్యాస్ ధరలు పెరగడంతో గ్యాస్ విడిపించేందుకు ఇబ్బంది పడుతునాం. రోజువారి కూలీ చేస్తేనే బతుకు ఉంటుంది. ఏడాదికి కేవలం గ్యాస్‌కు రూ. 14,400 ఖర్చవుతుంది. కూలి బతుకుల వారికి గ్యాస్ అలవాటు చేసి ఇప్పుడు ధరలు పెంచడం ఎంతవరకు సమంజసం.

సంకిలి సుభద్ర, సంకిలి.

గ్యాస్ రాయితీ ఇవ్వడం లేదు

వంట గ్యాస్‌కు గతంలో రాయితీ వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వాలు రాయితీ ఇవ్వటం లేదు. గ్యాస్ ధరలు పెంచడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కో గ్యాస్ బండ రూ.1200 చెల్లించి విడిపించాలంటే ప్రాణం ఉసూరుమంటుంది. వంట గ్యాస్ బాదుడుతో కుటుంబ సమేతంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గ్యాస్ ధరలు పెంచడమే తప్ప తగ్గించడం లేదు.

బెవర ఈశ్వరమ్మ, రేగిడి.

ఉచిత బియ్యమిచ్చి గ్యాస్‌ను పెంచేశారు.

కరోనా నేపథ్యంలో రూపాయికి వచ్చే బియ్యాన్ని ఉచితంగా ఇస్తూ దాన్ని వండి అన్నంగా తయారు చేయడానికి వినియోగించే గ్యాస్‌ను మాత్రం ఏటా వందల్లో పెంచేస్తున్నారు. దీంతో నానా అవస్థలు పడుతున్నాం. రోజు రోజుకి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీనికి తోడ నిత్యవసరాలు కూడా మండిపోతున్నాయి. ఇలా ఎప్పటికప్పుడు ధరలు పెంచేస్తే పేదలు ఎలా బతుకుతారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచి ధరలపై దృష్టి సారించి తగ్గించేలా చర్యలు తీసుకోవాలి.

నారు జనార్ధన, వినియోగదారుడు, సంకిలి

అక్రమంగా మట్టి తవ్వకాలు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామ సమీపం లో నడిమి చెరువు నుంచి ఎటువంటి అనుమతి లేకుండా కొంతమంది వ్యక్తులు ఆదివారం మట్టిని తరలించకపోతున్నారు. మండలంలో సహజ సంప దైన ఇసుక, కంకర, మట్టి వంటి సంపదను అక్రమ దారులు అక్రమంగా తరలించుకుపోతున్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి

సీతంపేట : గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎ.గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మారుమూల గిరిజన గ్రామాల్లో నీటి సమస్య వెంటాడుతుందన్నారు. బోర్లు మరమ్మతులకు గురయ్యాయని, బావులు అడుగంటి పోయాయని తెలిపారు. కావున అధికారులు స్పందించి తక్షణమే గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్ : జియ్యమ్మవలస మండలం గొర్లి గ్రామానికి చెందిన మెల్లిక తవిటమ్మ అనే గిరిజన మహిళ గత కొద్ది నెలలుగా దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. గత వారం రోజులుగా వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో మనస్థాపం చెంది శనివారం తన ఇంట్లో ఉన్న చీమల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న భర్త చక్రపాణి వెంటనే 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.